క్లుప్తంగా

గురజాల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు



పిడుగురాళ్ల: గురజాల నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. ప్రజలు నూతన సంవత్సరంలో సుఖసంతోషాలతో జీవితాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు.

ఎమ్మెల్యే జూలకంటి నూతన సంవత్సర శుభాకాంక్షలు

కారెంపూడి: మాచర్ల నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తనకు శుభాకాంక్షలు తెలపడానికి తరలివచ్చే వారు విద్యాభివృద్ధికి పనికి వచ్చే కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు. పెన్నులు పుస్తకాల వంటివి విద్యార్థులకు ఉపయోగపడేవి గిఫ్ట్‌గా ఇవ్వాలని కోరినట్లు.. ఎమ్మెల్యే కార్యాలయం పేర్కొంది.

ఎంఈఓ కాంతారావు మృతికి నివాళి



మాచర్ల: గుండెపోటుతో మాచర్ల ఎంఈఓ కూరగంటి కాంతారావు మృతి చెందడం బాధాకరమని నెహ్రూనగర్, వీరభద్రాపురం హెచ్‌ఎం గాదె కిరీటిరెడ్డి అన్నారు. మంగళవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు కాంతారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాచర్ల, వెల్దుర్తి, దాచేపల్లి, గురజాల ఎంఈఓగా విజయపురిసౌత్ స్కూల్ హెచ్‌ఎంగా విధులు నిర్వర్తించారన్నారు. కాంతారావు అకాల మృతిచెందడం బాధాకరమన్నారు. ఉపాధ్యాయులు షేక్ రహేనా, వి నాగమణి, జి నిర్మల మేరి, కె కేశవ రెడ్డి, కె ఉషారాణి, డి ఏడుకొండలు, సిహెచ్ కోర్లయ్య, నాగరాజు, వై ఏడుకొండలు, ఆదిలక్ష్మి తదితరులు నివాళులర్పించారు.

సేవా దృక్పథం కలిగి ఉండాలి



గురజాల రూరల్ : ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం కలిగి ఉండాలని స్మైల్ ఫౌండేషన్ అధ్యక్షుడు గుండా కాశీ విశ్వనాథం పేర్కొన్నారు. స్థానిక పాటపాటేశ్వరి అమ్మవారి దేవాలయ ప్రాంగణంలో మంగళవారం వృద్ధులకు, యాచకులకు అన్నదానం నిర్వహించారు. చుండు శ్రావణి సుబ్బుల కుమారుడు ఆయాన్ మొదటి పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేశారు. ఏచూరి సతీష్, ఏచూరి మణీదీప్, బండి రవికుమార్, కనకం హనుమంతరావు, జక్కా నాగేంద్రబాబు పాల్గొన్నారు.

ఆర్‌ఐగా అనిల్‌కుమార్



మాచర్ల రూరల్: మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌గా ఇంటూరి అనిల్ కుమార్ మంగళవారం నియమితులయ్యారు. ఈ మేరకు తహసీల్దార్ బత్తుల వాణికి నియామకపు ఉత్తర్వులు అందించారు. ఆయన గుంటూరు సివిల్ సప్లయిస్ ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ పదోన్నతి పై ఇక్కడకు వచ్చారు. పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండి సకాలంలో రెవెన్యూ సేవలందించి వాటి పరిష్కారం కోసం పనిచేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా వీఆర్‌ఓలు, కార్యాలయ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

మాచర్ల పట్టణాభివృద్ధికి కృషి చేస్తాం..



సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహరావు

మాచర్ల: నూతన సంవత్సరం సమష్టిగా పురపాలక సంఘం పాలక వర్గం ప్రజలకు పలు సౌకర్యాలు కల్పించి అభివృద్ధి బాటలో ఉంచాలని మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు అన్నారు. మంగళవారం పురపాలక సంఘం కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు అధ్యక్షత వహించారు. 10 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఇంటింటికి తాగునీటి సరఫరా చేసేందుకు రూ.3.30లక్షలతో ప్రతిపాదనలు చేశారు. రెండవ అంశంగా నీటి సరఫరాకు సంబంధించి 6వ వార్డులో రిజర్వాయర్‌ను ఏర్పాటు చేసి మోటార్‌కు రూ.2లక్షలు, సచివాలయ ఫర్నీచర్ కింద రూ. 14లక్షలు ఖర్చు చేసేందుకు ఆమోదం తెలిపారు. పట్టణంలోని పారిశుద్ధ్యం, మంచినీరు, 1 నుంచి 31వ వార్డుల్లో బోర్ల నుంచి నీటిని సరఫరా చేసేందుకు రిపేరుకు రూ. 4.50లక్షలు పలు అభివృద్ధి పనులకు సంబంధించి అన్నీ అంశాలను ఆమోదించారు. అడ్వాన్సు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సమావేశంలో కమీషనర్ డి.వేణుబాబు, కౌన్సిలర్లు గట్లా అరుణ కుమారి, రామాంజనేయరెడ్డి, ఎం.శ్రీనివాసావు, మోహన్, షేక్ సుభాని, బోయ రఘు రామిరెడ్డి, ఆయా వార్డు కౌన్సిలర్లు పలువురు పాల్గొన్నారు. పురపాలక సంఘ అధికారులు సుభాని, వెంగయ్య, తేజ, గౌతమి పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో.. నగర పంచాయతీ



సమస్యలపై చర్చిస్తున్న చైర్‌పర్సన్ సుబ్బమ్మ

దాచేపల్లి : నగర పంచాయతీని అభివృద్ధి పథంలో నిలుపుదామని చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ అన్నారు. స్థానిక సచివాలయంలో నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం మంగళవారం జరిగింది. చైర్‌పర్సన్ సుబ్బమ్మ అధ్యక్షత వహించారు. 11 అంశాలను కౌన్సిల్‌లో ప్రవేశపెట్టగా 10 అంశాలకు సభ్యులు అమోదం తెలిపారు. 30 అడుగుల తక్కువగా ఉన్న రోడ్ల పనులు చేపట్టేందుకు సభ్యులు వాయిదా వేయాలని కోరటంతో అమోదించారు. అనంతరం చైర్‌పర్సన్ సుబ్బమ్మ మాట్లాడుతూ..నగర పంచాయతీ అభివృద్ధి బాధ్యత ప్రతి సభ్యుడిపై ఉందని, వార్డుల్లో విస్తృతంగా పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. నగర పంచాయతీ నిధులతో పాటుగా ప్రభుత్వం ద్వారా వచ్చే నిధులతో కనీస మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని, తాగునీరు, పారిశుద్ధ్యం పనులకు తొలిప్రాధాన్యత ఇస్తున్నామని ఆమె చెప్పారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్లు షేక్ మస్తాన్‌బీ, కొమెరబత్తిన అన్నపూర్ణ, కమిషనర్ ఏవీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన బార్ అసోసియేషన్ సభ్యులు



పిడుగురాళ్ల కోర్టు వద్ద నిరసన తెలియజేస్తూ..



గురజాలలో విధులు బహిష్కరించిన న్యాయవాదులు

పిడుగురాళ్ల: కోర్టు విధులను పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం బహిష్కరించారు. గుంటూరు బార్ ఫెడరేషన్ పిలుపు మేరకు పొన్నూరు బార్ అసోసియేషన్ న్యాయవాది బేతాల ప్రభాకర్‌రావు మీద పొన్నూరు సీఐ, ఎస్ఐ, పోలీస్ సిబ్బంది అక్రమంగా దాడి చేశారని, నిరసనగా పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ సభ్యులు, లాయర్లు ధర్నా నిర్వహించారు. పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.కుమారస్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ... న్యాయవాది మీద పోలీసులు దాడి చేయటం సరైన పద్ధతి కాదని, ఇటువంటి దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. అలాగే లాయర్‌పై దాడికి దిగిన పోలీస్ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ సభ్యులు కె.కోటేశ్వరరావు, బి. దాసు, కె.వెంకటేష్, సీతరామయ్య, అచ్చారావు, ఎం.వెంకటేశ్వర్లు, ప్రశాంత్‌నాయక్, బి.రామకృష్ణ, పిచ్చయ్య, కేవీ కోటేశ్వరరావు, మహిళా న్యాయవాదులు పి.మణి, నవ్య, లోకేశ్వరి, పల్లవి పలువురు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

గురజాల : జిల్లా బార్ ఫెడరేషన్ పిలుపు మేరకు 10వ అదనపు జిల్లా జడ్జి కోర్టు నందు న్యాయవాదులు మంగళవారం రెండవ రోజు విధులు బహిష్కరించారు. పొన్నూరు కోర్టుకు చెందిన న్యాయవాది బేతాళ ప్రకాశరావుపై పోలీసులు అనుచిత ప్రవర్తనను ఖండించారు. ఈ కార్యక్రమంలో బండి వీరభద్రుడు, కర్రా చినకోటేశ్వరరావు, చీతిరాల కోటేశ్వరరావు, సురేష్, కె.ప్రభుదాసు, బి.సుందర జ్ఞానమ్మ, ఎస్.శ్యామలాదేవి న్యాయవాదులు తదితరులున్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



వృద్ధురాలికి పింఛన్ నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల: పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు నిర్వహించారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ... జనవరి 1న పంపిణీచేయాల్సిన పింఛన్ రాష్ట్ర వ్యాప్తంగా ఒక రోజు ముందుగా డిసెంబర్ 31నే పంపిణీ చేపట్టినట్లు ఆయన తెలిపారు. పట్టణంలోని 6వ వార్డుకు చెందిన పింఛన్ దారులకు పింఛన్ నగదు అందజేశారు. పట్టణ మున్సిపల్ ఏఈ రాఘవేంద్రరావు, అధికారులు పాల్గొన్నారు.

మలుపులు..ఆదమరిస్తే అంతే సంగతులు



నడికుడి సమీపంలో హైవే నుంచి పట్టణంలోకి వెళ్లే రహదారి

గురజాల : మలుపులు మృత్యు కుహరాలుగా మారాయి. మలుపులు ఉన్నాయనే విషయాన్ని గుర్తించే విధంగా సంబధిత అధికారులు ఎటువంటి హెచ్చరికలు బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో ఎదురెదురుగా వచ్చే వాహనదారులు ప్రమాదానికి దగ్గరగా వెళ్లి తృటిలో తప్పించుకుంటున్నారు. రెండు నెలల వ్యవధిలో ఈ మలుపుల వద్ద జరిగిన ప్రమాదాల్లో ముగ్గురు మృత్యువాత పడి, చాలామంది గాయపడిన ఘటనలున్నాయి. ప్రమాదాలు జరిగి, ప్రజలు మృత్యువాత పడుతున్నా కనీస జాగ్రత్తలు తీసుకునే విషయంలో సంబధిత అధికారులు స్పందించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నేషనల్ హైవే అథారిటీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రిళ్లు ప్రయాణించే వాహనదారులు మరింత ఆందోళన చెందుతున్నారు. ప్రత్యేకించి మంచు దట్టంగా పడుతున్న ప్రస్తుత సమయంలో మరిన్ని ప్రమాదాలు జరుగకముందే అధికారులు మేల్కొనాలని కోరుతున్నారు. ఎంతో మంది పేదలు వ్యవసాయ కూలీలు, వివిధ కంపెనీల్లో పనిచే సే కార్మికులు నిత్యం ఈ రహదారిలో ప్రమాణిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ రహదారిని ప్రమాదాల కేంద్రంగా మార్చడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదం జరిగితే... మృత్యు ఒడికేనా..?

హైవే నుంచి పట్టణంలోకి రావాలంటే హైవే పై నుంచి మలుపు తిరగాలి. ఆ మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. గురజాల పట్టణంలోకి రెంటచింతల, అంబాపురం నుంచి హైవేపై నుంచి వచ్చే వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి. నడికూడి సమీపంలో కూడా ఉన్న ఈ రహదారి మలుపు అధికంగా ఉంది. అదే విధంగా అధికారులు కూడా పలు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.



గురజాల సమీపంలో హైవే నుంచి పట్టణంలోకి రావాల్సిన రహదారి మలుపు

హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

వెల్దుర్తి: పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం బోధిలవీడు గ్రామానికి చెందిన లక్కపోగు శరవయ్య హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ గుంటూరు జిల్లా ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి ఆర్.శరత్ బాబు సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం బోదిలవీడు గ్రామానికి చెందిన శరవయ్య భార్య సుశీల తన పిల్లలతో ఇంటి ముందు మంచంలో నిద్రిస్తుండగా అదే గ్రామానికి చెందిన మక్కెన సురేష్, కొమరోలు సీతయ్య, ఇంకొల్లు కోటేశ్వరరావులు మద్యం తాగి ద్విచక్ర వాహనం పై వస్తూ మంచాన్ని ఢీ కొట్టగా ఆమె స్వల్ప గాయాలయ్యాయి. దీని పై ఆమె భర్త శరవయ్య ఎంఆర్‌పీఎస్ నాయకుల వద్ద పంచాయితీ పెట్టడంతో వారి ముగ్గురిని హెచ్చరించి పెద్ద మనుషులు రాజీ కుదిర్చారు. దీంతో కక్ష్య పెంచుకున్న పై ముగ్గురు శరవయ్యను గ్రామంలో అవమానిస్తూ అవహేళన చేస్తూ హతమార్చేందుకు అవకాశం కోసం ఎదురుచూశారు. 2015 నవంబర్ 13న రాత్రి సమయంలో గ్రామంలోని కిరాణా కొట్టు వద్దకు వెళ్లి సరుకులు తీసుకొని తిరిగి వస్తున్న సమయంలో శరవయ్య పై సురేష్‌తో పాటు సీతయ్య, కోటేశ్వరరావు, మక్కెన వెంకయ్య, కొమరోలు వెంకటేశ్వర్లు, ఇంకొల్లు సుబ్బయ్య మారణాయుధాలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. దీని పై వెల్దుర్తి పోలీసులు కేసు నమోదు చేసి ఆరుగురి పై చార్జిషీటు దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ నిందితులలో మక్కెన సురేష్, కొమరోలు సీతయ్యల పై నేరం రుజువుకావటంతో వారివురుకు జీవిత ఖైదు రూ. 500ల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

రబీలో పొగాకు సాగు లాభదాయకం



మాచవరం: రబీలో పొగాకు సాగు ఎంతో లాభదాయకరమని ఏఓ కె.రామమ్మ అన్నారు. మండలంలోని కొత్తగణేశునిపాడు, మల్లవోలు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వివిధ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా పొగాకు సాగులో గాలి, అగ్ని, ఫ్లూ పద్ధతుల ద్వారా క్యూరింగ్ చేసే విధానాన్ని రైతులకు వివరించారు. క్యూరింగ్ నాలుగు ముఖ్యమైన దశలు కలిగి ఉంటుందని, విల్టింగ్, పసుపు, కలరింగ్, ఎండ బెట్టుట విధానాల ద్వారా నాణ్యత లభిస్తుందని తెలిపారు. ధాన్యం తేమ శాతం అధికంగా లేకుండా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చల్లగుండ్ల నరసింహారావు, వ్యవసాయ సహాయకులు సతీష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలు



భవిత కేంద్రంలో నూతన సంవత్సర వేడుకలు

పిడుగురాళ్ల: పట్టణంలోని విద్యా వనరుల కేంద్రం ప్రాంగణంలో ఉన్న భవిత దివ్యాంగుల పాఠశాలలో సోమవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. పట్టణానికి చెందిన డాక్టర్ వెంకట్ నవీన్ సౌజన్య ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి విద్యార్థులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్‌టీ అజిత్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.